

విజృంభిస్తున్న విష జ్వరాలు

- మంచం పట్టిన పల్లెలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

సీజన్ మారింది.. వానలు జోరుగా కురుస్తున్నాయి. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరాలతో మంచం పట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు జనం వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు పెరుగుతున్నాయి. వారం రోజులుగా ప్రతి రోజూ 3వేల మందికి పైగా ఓపీకి రోగులు వస్తున్నారు. గ్రామాల్లో రెండు మూడు రోజులకు ఓసారి కూడా వైద్యసిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని పీహెచ్‌సీల్లో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వైద్యులు ఇంటి ముఖం పడుతున్నారు. వాతావరణ మార్పుల దృష్ట్యా ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నపెద్దా అనే తేడా లేకుండా వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్‌తో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌ల్లో, ఎమ్మిగనూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగాయి. ఈ ఓపీ కేసుల్లో 60శాతం వైరల్ ఫీవర్స్‌గా నమోదవుతున్నాయి.

ఆస్పత్రులకు క్యూ..

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలు మంచం పట్టారు. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఇంట్లో ఒకరు తర్వాత మరొకరు విషజ్వరాలతో అల్లాడిపోతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రమే తగ్గడం లేదని రోగులు మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.





కిటకిటలాడుతున్నాయి..

కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌లు, డోన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ప్రైవేటు ఆసుపత్రులు, రోగులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలు జీజీహెచ్‌లో ప్రతిరోజు ఓపీకి 2700 మంది రోగులు వచ్చేవారు. పది రోజులుగా ఈ సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య 3వేలు దాటుతోంది. వీరిలో ప్రతి రోజూ 200 మంది దాకా అడ్మిషన్ పొందుతున్నారు. ఇందులో 70 శాతం వైరల్ ఫీవర్ కేసులు ఉండటం కలవరపెడుతోంది. నంద్యాల జీజీహెచ్‌లో కూడా ఓపీ రోగుల సంఖ్య 1300 నుంచి 1500 దాకా నమోదవుతున్నాయి. ఇక ఆదోని ఆసుపత్రిలో రోజు వారి ఓపీ 800 దాటుతోంది. విషజ్వరాలు పెరగడంతో కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షల కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

నేడు మోస్తరు వర్షం

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం మెట్రాలజిస్ట్ వెంకట్రావు తెలిపారు. ఈశాన్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడనం ఏర్పడే అవకాశముందన్నారు. అల్పపీడన ప్రభావంతో మోస్తరు వర్షంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి: జేసీ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి బాధితులు అధికారులకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ 332 అర్జీలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను అధికారులు గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ వారికి అర్థమయ్యేలా స్పష్టంగా ఇవ్వాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

7న మహానంది ఆలయం మూసివేత

మహానంది, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం పురస్కరించుకొని ఈనెల 7వ తేదీన మహానంది క్షేత్రంలో ప్రధాన ఆలయం తలుపులను మధ్యాహ్నం 1:30 గంటల నుంచి మూసివేసి దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తిరిగి 8న తెల్లవారుజామున 4 గంటలకు ఆలయం తలుపులు తెరిచి ఆలయంలో శుద్ధి, సంప్రోక్షణ, ప్రాతఃకాల ఆరాధనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి భక్తులకు యథావిధిగా దర్శనానికి అనుమతిస్తామని ఈవో తెలిపారు.

కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

- జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పలు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నుంచి ఇద్దరికి పదవులు దక్కాయి. మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన ఎం.అజిముద్దీన్, ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన ముద్దవరం సంజమ్మ నియమితులయ్యారు.

1,525 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లు

- ప్రభుత్వ మద్దతుధర రూ.1200
- హర్షం వ్యక్తం చేసిన రైతులు

7

మల్లన్న ఆలయ ముఖ్య భద్రతాధికారిగా శ్రీనివాసరావు



శ్రీశైలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానానికి ముఖ్య భద్రతాధికారి (చీఫ్ సెక్యూరిటీ)గా బి.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈయన భారత సైన్యంలో జూనియర్ కమిషన్ అధికారిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. శ్రీశైలం ఆలయ ముఖ్య భద్రతాధికారిగా శ్రీనివాసరావు రెండేళ్ల పాటు కొనసాగుతారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతి నెల 1న పింఛన్లు అందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, క్లస్టర్ ఇన్‌చార్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా శ్రీశైలం

- పది గేట్ల ద్వారా నీటి విడుదల



జలాశయం గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు

శ్రీశైలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో డ్యాం నిండు కుండలా దర్శనమిస్తోంది. సోమవారం 10 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,67,440 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి ఎడమగట్టు జల ఉత్పాదన కింద 65,603 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి 2,35,163 క్యూసెక్కుల వరద జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 885అడుగులు కాగా.. సోమవారం సాయంత్రం 6 గంటలకు 882.10 అడుగులకు చేరింది. నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా 199.7354 టీఎంసీలుగా నమోదైంది.



పెచ్చులూడి పడ్డాయి..

- సాతనూరు కొట్టాల పాఠశాలలో కూలిన పైకప్పు
- ఆదివారం కావడంతో తప్పిన పెను ప్రమాదం
- శిథిలావస్థకు చేరినా పట్టించుకోని పాలకులు, అధికారులు



పెచ్చులూడి పడిన పైకప్పు

కోసిగి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతనూరు కొట్టాల ప్రాథమిక పాఠశాలలో తరగతి గది పైకప్పు పెచ్చులూడి పడింది. అదృష్టవశాత్తు ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారనే చెప్పవచ్చు. సోమవారం ఉదయం ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్, విద్యా కమిటీ చైర్మన్ రవికుమార్ పాఠశాల తాళాన్ని తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుడు కూర్చొనే చోట సుమారు 5 అడుగుల మేర పైకప్పు కూలి శిథిలాలు కుర్చీ, బెంచ్‌లపై పడి ఉన్నాయి. పాఠశాల కూలిపోయే స్థితికి ఉందని, గతంలో కూడా విద్యాధికారులకు, నాయకులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు మొదటి, రెండో ఫేజ్‌లో కూడా పాఠశాల నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వమైనా ప్రభుత్వ పాఠశాలను కొత్తది నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, విద్యాకమిటీ చైర్మన్ రవికుమార్ కోరారు. ఇదే విషయాన్ని మండల విద్యాధికారి శ్రీనివాసులును వివరణ కోరగా పాఠశాలను పరిశీలించామని, అయితే గతంలో అధికారులు నాడు-నేడు పనులు చేపట్టకపోవడంతో పాఠశాల శిథిలావస్థకు చేరిందని, త్వరలోనే జిల్లా విద్యాధికారికి నివేదిక పంపిస్తామన్నారు.



ఏకదంతాయ.. వక్రతుండాయ..



దేవా నగర్‌లో కొలువైన వరసిద్ధి వినాయకుడు


భక్తిశ్రద్ధలతో గణేశ్ శరన్నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందడి కర్నూలు నగరంలో బాగా కనిపిస్తోంది. వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన గణేశ్ మంటపాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు విచ్చేసి తొలిపూజల ఇలవేల్పునకు ప్రత్యేక పూజలు, అర్చనలు, విశేష హారతులు, గణేశ పంచాక్షరీ స్తోత్రాలు, అష్టోత్తర నామ పారాయణలు చేస్తున్నారు. గణేశ్ మంటపాల వద్ద సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత కచేరీలు, చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆరో రోజున మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం అల్పాహారం పంపిణీ చేశారు. నగరంలో మెడికల్ కళాశాల హాస్టల్ ముందు ఏర్పాటు చేసిన గణపతి మూర్తి తెల్లని కోటు, మెడలో స్టెతస్కోపుతో దర్శనమిచ్చారు. సి.క్యాంపులో ఆదిశేషుని తలను దాల్చి, నందివాహనంపై ఆసీనుడైన గణనాథుడు భక్తులను ఆకట్టుకుంటున్నాడు. భాగ్యనగర్‌లో సింహ వాహనంపై శాంతి వదనంతో, గణేశ్ నగర్‌లో భారీ గణపతి మూర్తి రూపంలో, సి.క్యాంపు ఆరోరానగర్‌లో తిరుమల శ్రీవారిని తలపై దాల్చిన గణపతి మూర్తి, అదేప్రాంతంలో శివాజీ మహారాజ్ పక్కన పెట్టుకొని, సూర్యతేజోవంతుడైన వినాయకుడు దర్శనం ఇస్తున్నారు. బిర్లా కాంపౌండ్‌లోని దేవానగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది. లక్ష్మీనగర్, ప్రకాశ్‌నగర్‌లలో శాంతమూర్తి గణపతి విగ్రహాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.





అరోరానగర్..



భాగ్యనగర్...



సీ క్యాంప్..



లక్ష్మీ నగర్‌లో..



గణేష్ నగర్

సర్టిఫికెట్ తారుమారు

ఒక్క ఐడియా జీవితానే మార్చివేస్తుంది.. ఒక్క చెత్త ఐడియా ఎందరో జీవితాలను నాశనం చేస్తుంది.. ఇలాంటి ఓ ఆలోచనతోనే జిల్లా స్పోర్ట్ అధికారులు వ్యవహరించడంతో ఓ ప్రతిభావంతుడైన క్రీడాకారుడు ఉద్యోగాన్ని కోల్పోయాడు. క్రీడల్లో ప్రతిభను చాటుతూ ఎన్నో విజయాలు సొంతం చేసుకున్నాడు గొల్ల రామాంజనేయులు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పలు పోటీల్లో పాల్గొన్నాడు. ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు. డీఎస్సీలో ఉద్యోగం పొందేందుకు జాతీయ స్థాయి సర్టిఫికెట్ లేకపోవడంతో మిన్నకుండిపోయాడు. కానీ అసలు అతడి సర్టిఫికెట్ అదే పేరు ఉన్న ఓ కేటుగాడి చేతిలోకి వెళ్లింది. దీంతో ఉద్యోగం పొందాలనుకొని సర్టిఫికెట్ల పరిశీలనలో దొరికిపోయాడు.. దీనికి సంబంధించిన వివరాలు..

- జిల్లా స్పోర్ట్స్ అధికారుల తప్పిదం
- ప్రతిభావంతుడికి తీవ్ర అన్యాయం
- ఉద్యోగం కోల్పోయిన నిరుద్యోగి
- డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన బయటపడిన వైనం
- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అధికారుల తప్పిదంతో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఓ నిరుద్యోగి ఉద్యోగాన్ని కోల్పోవలసి వచ్చింది. ఒకరి స్పోర్ట్ సర్టిఫికెట్‌ను అదే పేరుగల మరో వ్యక్తికి గుట్టుచప్పుడు ఇచ్చారు. ఆ సర్టిఫికెట్‌తో డీఎస్సీ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవటం.. సర్టిఫికెట్ల పరిశీలనలో బ్యాకప్ సర్టిఫికెట్లును అధికారులు అడగటంతో అసలు విషయం కాస్త వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న గొల్ల రామాంజనేయులు ఇంటర్మీడియట్ చదివి యూజీపీడీ కోర్సును పూర్తిచేశాడు. మొదటి నుంచి రన్నింగ్‌లో ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ వచ్చాడు. ఈ క్రమంలో కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. 2015లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయిలో జరిగిన క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభకనబరచి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. 2016లో పూణేలో జరిగిన జాతీయస్థాయి 50 అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని 19వ స్థానంలో నిలిచాడు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్ ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తూ వచ్చారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు స్పోర్ట్ కోటాలో డీఎస్సీ (పీఈటీ పోస్టుకు)కి నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. గొల్ల రామాంజనేయులుకు జాతీయ స్థాయి సర్టిఫికెట్ అధికారులు ఇవ్వకపోవటంతో డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోయాడు.



బాధితుడు గొల్ల రామాంజనేయులు

అథ్లెటిక్స్‌లో పాల్గొనని అదేపేరు ఉన్న మరో వ్యక్తికి..

ఎన్నడూ అథ్లెటిక్స్‌లో పాల్గొనని అదేపేరు ఉన్న మరో వ్యక్తికి అధికారులు గుట్టుచప్పుడు కాకుండా జాతీయ స్థాయి సర్టిఫికెట్‌ను ఇచ్చారు. దీంతో సదరు వ్యక్తి నేరుగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం కోసం జాతీయస్థాయి సర్టిఫికెట్‌లో పుట్టిన తేదీని మార్చి దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన పేరు మెరిట్ లిస్టులో వచ్చింది. ఇటీవల విజయవాడలో జరిగిన సర్టిఫికెట్ల పరిశీలన సందర్భంగా అధికారులు సదరు వ్యక్తిని గతంలో అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్లు తీసుకురావాలని కోరారు.

డీఎస్సీకి అవకాశమివ్వాలి

జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని సర్టిఫికెట్ సాధించా. నా సర్టిఫికెట్‌ను జిల్లా స్పోర్ట్స్ అధికారులు మరొకరికి ఇచ్చారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. నా సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి మెరిట్ లిస్టులో పేరు వచ్చింది. ఈవిషయం నాకు తెలియటంతో రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాను. అతడి పేరును తొలగించారు. ఆ స్థానంలో నాకు డీఎస్సీలో అవకాశం ఇచ్చేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకోవాలి.

● గొల్ల రామాంజనేయులు, ఎమ్మిగనూరు

సర్టిఫికెట్ల కోసం మభ్యపెట్టే ప్రయత్నం..

అతని దగ్గర ఆ సర్టిఫికెట్లు లేకపోవటంతో ఎలాగైనా ఉద్యోగాన్ని పొందాలన్న తలంపుతో అసలైన అథ్లెటిక్ గొల్ల రామాంజనేయులును ఆశ్రయించి సర్టిఫికెట్ల కోసం మభ్యపెట్టే ప్రయత్నం చేశాడు. దీంతో అసలు విషయం బయటపడింది. తనకు జరిగిన అన్యాయాన్ని జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు గొల్ల రామాంజనేయులు ఫిర్యాదు చేశాడు. ఒకరి ప్రతిభకు సంబంధించిన సర్టిఫికెట్లను మరొకరికి కట్టబెట్టిన సంబంధిత అధికారులపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని క్రీడాకారులు కోరుతున్నారు.

కవులు, కళాకారులకు సహకారం

● అరుణ భారతి వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి



సుధీర్‌బాబును సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, గురూజీ రామశేషయ్య, తదితరులు

బనగానపల్లె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : కవులు, కళాకారులను అరుణ భారతి సాహితీ సంస్థ ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు అండగా ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో ఆరుద్ర శత జయంతి సందర్భంగా కొండపేటకు చెందిన కవి, రచయిత సుధీర్‌బాబును బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ సుధీర్‌బాబు ఇప్పటి వరకు మూడువేలకుపైగా కవితలు రాసి ఎంతో మంది మన్ననలు పొందారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కవులు, కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, భగవద్గీత ప్రచారకులు గురూజీ రామశేషయ్య, ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయకుమార్, ప్రముఖ జ్యోతిష్య పండితుడు వెంకటరాముడుశాస్త్రి, రోటరీ క్లబ్ సభ్యుడు బలరామయ్య, భరతుడు, బొబ్బల మహేశ్వరరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలి

● ఇన్‌చార్జి వీసీ బసవరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఇన్‌చార్జి ఉపకులపతి వి. వెంకట బసవరావు కోరారు. క్లస్టర్ వర్సిటీలో సోమవారం రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ అధ్యక్షతన అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ కళాశాలలకు అటానమస్ హోదా సాధన కోసం తీసుకోవాల్సిన వ్యూహాల గురించి సూచనలు చేశారు. న్యాక్ గుర్తింపు కోసం అనుసరించాల్సిన నూతన ప్రక్రియలు, క్రీడల అభివృద్ధి, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ విస్తరణ, త్వరలోనే స్థాపించనున్న ఇంక్యుబేషన్‌సెంటర్ గురించి వివరించారు. విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం, వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్న వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాదరెడ్డి, రంగారెడ్డి, డీన్ అక్తర్ భాను, అధ్యాపకులు మహమ్మద్ వాహీజ్, నాగరాజ్ శెట్టి, ఎగ్జామినేషన్‌కంట్రోలర్ బాలసుబ్రహ్మణ్యం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో షణ్ముఖకు బంగారు పతకం



షణ్ముఖకు గోల్డ్‌మెడల్ ప్రదానం చేస్తున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్-17లో మహానంది మండలం తమడపల్లెకి చెందిన డి.షణ్ముఖ బంగారు పతకం సాధించాడు. తూర్పుగోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఆగస్టు 26న ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. సెప్టెంబరు 8నుంచి 13వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్వానీలో జరిగే జాతీయస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నట్లు కోచ్ లక్ష్మణ్ తెలిపారు. షణ్ముఖను తల్లిదండ్రులు డి.మురళి, డి.హాసేనబీ, గ్రామస్థులు అభినందించారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేతలకు సన్మానం



రాష్ట్ర స్థాయి విజేతలను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజేతగా ఉమ్మడి కర్నూలు జట్టు నిలిచింది. ఆగస్టు 29నుంచి 31వరకు నెల్లూరు జిల్లా గూడూరు మండలం చెవ్వూరు రామదూత ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురురాజా పాఠశాలలో విజేతలైన జట్టుకు సోమవారం ప్రత్యేకంగా అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహభావంతో విజయాలు సాధించవచ్చన్నారు. తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్, బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న టీజీవీ కళాక్షేత్రంలో శాస్త్రీయ నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని శాంతి తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో శాస్త్రీయ (సోలో డ్యాన్స్) నృత్య పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు ఎం.మనోహర్ బాబు తెలిపారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 7న మధ్యాహ్నం 3 గంటలకు ఈ నృత్య పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. దివంగత నాట్యరత్న వెంకటస్వామి సంస్మరణ సభ సందర్భంగా ఈపోటీలు ఉంటాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. పేర్లను నమోదు చేసుకునేందుకు 9100437765 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపాలన్నారు. పోటీల్లో ఏకవ్యక్తి నృత్యం (సోలో డ్యాన్స్) మాత్రమే అనుమతి ఉంటుందని, 10 నుంచీ 20 ఏళ్ల వయసుగల వారు మాత్రమే పోటీలకు అర్హులని తెలిపారు. పోటీదారులు 8 నిముషాల వ్యవధిలోనే ప్రదర్శన చేయాలని, ఆహార్యం, దుస్తులు వారే సమకూర్చుకోవాలని తెలిపారు. 7న సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అతిథులుగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య, గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకరశర్మ హాజరవుతారని తెలిపారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

5వ పేజీ తరువాయి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు పెరుగుతున్నాయి. నంద్యాల జిల్లాలో 95 డెంగీ కేసులను గుర్తించారు. మలేరియా కేసులు 12గా గుర్తించారు. బేతంచెర్ల, నందికొట్కూరు, డోన్, నంద్యాల ప్రాంతాల్లో డెంగీ వ్యాధిగ్రస్థుల సంఖ్య అధికంగా ఉంది. ఇక కర్నూలు జిల్లాలో జనవరి నుంచి ఆగస్టు వరకు 187 డెంగీ కేసులు వచ్చాయి. ఇందులో సి.బెళగల్ మండలంలో అత్యధికంగా 15, క్రిష్ణగిరి మండలంలో 13, నన్నూరు పీహెచ్‌సీలో 11, హాలహర్విలో పీహెచ్‌సీలో 8, ఉలిందకొండ పీహెచ్‌సీలో 8, లద్దగిరి పీహెచ్‌సీలో 8 కేసులు వెలుగు చూశాయి. ఇక మలేరియా కేసులు 8 గుర్తించారు. కర్నూలు అర్బన్‌లో-2, ఓర్వకల్లు, రేమట ప్రాంతాల్లో కేసులు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో పలు ఆసుపత్రుల్లో డెంగీ కిట్లు ఉన్నప్పటికీ నిర్ధారణ పరీక్షలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డెంగీతో పాటు వర్షాలు కురుస్తుండటంతో నీరు కలుషితం కావడంతో టైఫాయిడ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. గ్రామాల్లో రెండు మూడు రోజులకు వైద్యసిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడం లేదు. అన్ని పీహెచ్‌సీలో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వైద్యులు ఇంటి ముఖం పడుతున్నారు. కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కార్యాలయం వదిలి బయటకు వెళ్లడం లేదు. ప్రోగ్రాం ఆఫీసర్లకు అద్దె వాహనాలు ఇచ్చినా కర్నూలు నగరం దాటి బయటకు పోవడం లేదు. దీంతో పర్యవేక్షించే అధికారులు లేకపోవడంతో గ్రామీణ వైద్యం అటకెక్కింది.



వైరల్ ఫీవర్లపై ఆందోళన వద్దు



వారం రోజుల నుంచి వైరల్ ఫీవర్ కేసులు అధికంగా వస్తున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో కేసులు పెరిగాయి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి లక్షణాలతో వస్తున్నారు. వైరల్ ఫీవర్లపై ఆందోళనవద్దు. పారాసిటమాల్ మాత్రలు వేసుకుని నీరు బాగా తాగి న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటే జ్వరం తగ్గిపోతుంది.

● డాక్టర్ కె.విద్యాసాగర్, ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

సీజనల్ వ్యాధులు పెరిగాయి



వాతావరణ మార్పులు, ఇటీవల కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు పెరిగాయి. ఓపీకి వచ్చే కేసుల్లో 70శాతం వైరల్ ఫీవర్ కేసులే అధికంగా వస్తున్నాయి. నాలుగు రోజులైనా జ్వరం తగ్గని వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి. సీజన్ మారుతున్న నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

● డాక్టర్ డమం శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

రోగుల సంఖ్య పెరిగింది



సీజనల్ వ్యాధులతో జీజీహెచ్‌కు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. గురువారం ఆసుపత్రిలో ఓపీకి రికార్డు స్థాయిలో 3330 రోగులు వచ్చారు. ఇందులో 215 మంది అడ్మిషన్ పొందారు. మొత్తం 1247 మంది ఆసుపత్రిలో వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల్లో విషజ్వరాల తీవ్రత అధికంగా ఉంటే అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నాం.

● డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

ఐఐఐటీడీఎంలో 'స్పేస్ ఆన్ వీల్స్'




వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న ఐఐఐటీడీఎం ప్రాంగణంలో సోమవారం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, ఐఐఐటీడీఎం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్పేస్ ఆన్ వీల్స్' విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఇస్రో ఆధ్వర్యంలో జరిగే శాటిలైట్ మోడల్స్, రాకెట్ మోడల్స్ ప్రదర్శన విద్యార్థులను కనువిందు చేసింది. ఇస్రో ఆధ్వర్యంలో ప్రారంభం నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన గగన్‌యాన్ మిషన్ వర్క్ జరిగిన విజయాలను రిటైర్డు ఇస్రో సైంటిస్టు, కర్నూలు ఐఐఐటీడీఎం ప్రొఫెసర్ చంద్రశేఖర్ ప్రదర్శనకు తరలివచ్చిన విద్యార్థులకు అర్థవంతంగా, సరళమైన భాషలో వివరించారు. ఈ స్పేస్ ఆన్ వీల్స్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ వెంకట బసవరావు లాంఛనంగా ప్రారంభించారు. రిటైర్డు ఇస్రో సైంటిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 2023 ఆగస్టు 23వ తేదీన భారతదేశం మొట్టమొదటి సారిగా ఇస్రో ఆధ్వర్యంలో సదరన్ కోల్డ్ రీజియన్ స్పాట్ మీద ల్యాండింగ్ చేసిన సందర్భంగా ప్రతి సంవత్సరం ఇదే రోజున నేషనల్ స్పేస్ ఆన్ వీల్స్ డే జరుపుకున్నట్లు తెలిపారు. వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 2వేల మంది విద్యార్థులు ప్రదర్శనను సందర్శించారు.

సంతానోత్పత్తి కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



ఐవీఎఫ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంతానోత్పత్తి కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించి సక్రమంగా వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ ఆదేశించారు. పట్టణంలో నెరవాటి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మాతృత్వ ఐవీఎఫ్ కేంద్రం, ఐకాన్ ఐవీఎఫ్ కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐవీఎఫ్ కేంద్రాలకు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్, రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమందికి సంతానోత్పత్తి చికిత్స చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదవారికి కూడా కేంద్రాల్లో రుసుం తగ్గించి సేవలు అందించాలని సూచించారు. ఐవీఎఫ్ కేంద్రాలపై ఫిర్యాదులు అందితే విచారించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతానం కోసం వచ్చే దంపతులను వేధించకుండా, ధరలతో భయభ్రాంతులకు గురిచేయకుండా చూడాలని సూచించారు. ఐవీఎఫ్, సరోగసీ విధానాలపై ముందస్తు అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్కానింగ్ గది బయట, లోపల, రిసెప్షన్ సెంటర్ వద్ద ఐఈసీ బోర్డును ప్రదర్శించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయకూడదని ఫారం-ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ధరల పట్టికను రిసెప్షన్ కౌంటర్‌వద్ద ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శించాలన్నారు. నిర్దేశించిన సమయంకంటే రెండు నెలలు ముందుగానే రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవాలన్నారు. తనిఖీలో డాక్టర్ భరత్‌కుమార్, ఇన్‌చార్జి డెమో కె.రంగనాయక్ పాల్గొన్నారు.

పట్టపగలే వృద్ధురాలి దారుణహత్య

- సాయివైభవ్‌నగర్‌లో ఘటన
- వంట మనిషిపైనే అనుమానం
- ఉలిక్కిపడ్డ పోలీసు శాఖ


కాటసాని శివలీల(ఫైల్)

కర్నూలు క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా కొట్టి చంపారు. ఈ ఘటన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేశ్ నగర్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈఘటనతో పోలీసు శాఖ ఉలిక్కి పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సాయి వైభవ్‌నగర్‌లోని ఓ విల్లాలో కాటసాని శివలీల(72) ఒంటరిగా ఉంటుంది. ఆమె భర్త సాంబశివారెడ్డి ఏడాదిన్నర క్రితం మృతిచెందాడు. కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు గంగాధర్‌రెడ్డి అమెరికాలో డాక్టర్‌గా స్థిరపడ్డాడు. కూతురు ఉమామహేశ్వరమ్మ కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తుంది. ఆమె భర్త (రిటైర్డు ఏసీపీవో) చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి వెంకటరమణ కాలనీలో నివాసముంటుంది. శివలీల విల్లాలో ఒంటరిగా ఉంటూ ఇంటిపై ఉన్న పెంట్ హౌస్‌ను ఇద్దరు మెడికల్ రెప్‌లకు అద్దెకు ఇచ్చారు. కూతురు ఉమామహేశ్వరమ్మ కొద్ది కాలంగా తల్లివద్దనే ఉంటూ కళాశాలకు వెళ్లి వస్తుంది. అల్లుడు చంద్రశేఖర్ రెడ్డి వీరి ఇంటికి తరుచూ వచ్చి వెళ్తుంటారు. సోమవారం కూడా కూతురు కళాశాలకు వెళ్లింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో అల్లుడు చంద్రశేఖర్ రెడ్డి శివలీల ఇంటికి వచ్చాడు. లోపల శివలీల రక్తపు మడుగులో పడి ఉండటం చూసి భార్య ఉమామహేశ్వరమ్మకు ఫోన్‌చేశాడు. కొన ఊపిరితో పడి ఉన్న ఆమెను స్థానికులు, పోలీసుల సాయంతో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నగల కోసమే ఈ హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన వెంటనే బెడ్‌రూంలో కూడా నగల కోసం వెతికినట్లుగా గుర్తించారు. ఎక్కువ సమయం లేక వదిలేసి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

గొలుసు, రెండు గాజులు మాయం

శివలీల మెడపై పదునైన ఆయుధంతో దాడి చేయడంతో రక్తస్రావమైంది. ఆమె మెడలో ఉన్న గొలుసు, రెండు బంగారు గాజులు మాయమైనట్లు కూతురు ఉమామహేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంట్లో ఇతర వస్తువులు ఏమీ పోలేదని పోలీసులు తెలిపారు. హతురాలి ఇంట్లోని సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులకు ఇబ్బందిగా మారింది. కాలనీలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాటసాని శివలీల ఇంట్లో పనిచేసే వంటమనిషి వరలక్ష్మిపైన అనుమానాలు వ్యక్తం చేస్తూ కూతురు ఫిర్యాదు చేసింది. రెండు రోజుల క్రితమే ఆమె పని మానేసిందని పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. ఈరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు ఫోన్‌చేసి పనికి రావాల్నా అని అడిగిందని, ఆమెపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం

సంఘటన తెలిసిన వెంటనే సాయంత్రం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఘటనాస్థలిని పరిశీలించారు. డీఎస్పీ బాబుప్రసాద్, త్రీటౌన్ సీఐ శేషయ్య, నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ, రూరల్ సీఐ శ్రీధర్‌తో పాటు పలువురు ఎస్‌ఐలు, క్రైం పార్టీ కానిస్టేబుళ్ల సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఎస్పీ వెల్లడించారు.

పలువురి పరామర్శ


పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

హతురాలు కాటసాని శివలీల పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి దూరపు బంధువు. కాటసాని ఆమె స్వగృహానికి చేరుకుని కూతురు, అల్లుడిని పరామర్శించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సైతం హతురాలి ఇంటికొచ్చి కుమార్తె అల్లుడులను పరామర్శించారు.

బంగారు వ్యాపారి..

- మసీదుకు వెళ్లి వస్తుండగా మారణాయుధాలతో దాడి
- ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


రక్తపు మడుగులో పడి ఉన్న హిజార్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగారు వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాధాకృష్ణ థియేటర్ సమీపంలో చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కొత్తపేటకు చెందిన హిజార్(42)స్థానిక షరాఫ్ బజారులో బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న ఓ మసీదుకు వెళ్లి తిరిగి వస్తుండగా కొంతమంది యువకులు మారణాయుధాలతో అతడిపై దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన హిజార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, వన్‌టౌన్ సీఐ పార్థసారధి ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. పాతబస్తీకి చెందిన ఇర్ఫాన్, ఇమ్రాన్ అనే వ్యక్తులపైన అనుమానం వ్యక్తం చేస్తూ హతుడి తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

1,525 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లు

- ప్రభుత్వ మద్దతు ధర రూ.1200
- హర్షం వ్యక్తం చేసిన రైతులు


ఉల్లిగడ్డలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునేందుకు చేపట్టిన కార్యక్రమానికి స్పందన లభించింది. కర్నూలు మార్కెట్ యార్డుకు సోమవారం వచ్చిన 1,525 క్వింటాళ్ల ఉల్లిని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1,200 చొప్పున రైతులకు చెల్లించి కొనుగోలు చేసింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి 1,607 క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారు. ఇందులో 1,525 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.1,200 ప్రకారం కొనుగోలు చేశారు. 1,607 క్వింటాళ్లలో 554 క్వింటాళ్లను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు టెండర్లు వేశారు. కిలో రూ.6 నుంచి కేవలం రూ.8లకు కొనుగోలు చేసేందుకు టెండర్లు వేశారు. అయితే రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఆ 554 క్వింటాళ్ల ఉల్లిని కూడా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. 1,607 క్వింటాళ్లలో 82 క్వింటాళ్లను వ్యాపారులు రూ.1,329 ప్రకారం కొనుగోలు చేశారు.

56.50 క్వింటాళ్లు తీసుకొచ్చా



మార్కెట్ యార్డుకు 56.50 క్వింటాళ్ల ఉల్లిని తీసుకొచ్చా. క్వింటా రూ.517తో కొనుగోలు చేస్తామని వ్యాపారులు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.1200 క్వింటా చొప్పున పంటను కొనుగోలు చేసింది. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- చంద్రప్ప, పార్లపల్లె, ఎమ్మిగనూరు మండలం

సంతోషంగా ఉంది



ఉల్లి రైతుల కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అందుకే రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. నేను 25 క్వింటాళ్ల ఉల్లిని తీసుకొచ్చాను. రూ.1200 మద్దతు ధరతో విక్రయించాను. చాలా సంతోషంగా ఉంది.

- మద్దయ్య, ఎర్రగుడి గ్రామం, కృష్ణగిరి మండలం

రైతులకు అండగా ప్రభుత్వం

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


రైతుతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుందని, అందువల్ల రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం ఉదయం మంత్రి కర్నూలు మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటం ఉల్లికి రూ.1,200 ధర అందించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉల్లికి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరపై రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం సంతోషంగా ఉందని, ప్రస్తుతం అందిస్తున్న క్వింటాకి రూ.1,200తో పాటు మరికొంత సాయాన్ని అందించాలని రైతులు కోరారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కష్టాల్లో ఉన్న రైతులు, అన్ని వర్గాల ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు సీఎం చంద్రబాబు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందేందుకు రైతులు అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కడప జేడీ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, ఏడీఎం నారాయణ మూర్తి, కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, యార్డు చైర్మన్ గోల్కొండ అజ్మీత్‌బీ, వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, డైరెక్టర్లు, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న పాల్గొన్నారు.

కలెక్టర్ సందర్శన: కర్నూలు మార్కెట్ యారులో ఉల్లి విక్రయాలను కలెక్టర్ రంజిత్ బాషా పరిశీలించారు. జేసీ నవ్యతో పాటు మార్క్‌ఫెడ్ అధికారులతో వెళ్లి ఉల్లి రైతులతో మాట్లాడారు.

క్వింటా ఉల్లి రూ.2,500కు కొనుగోలు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కర్నూలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిగడ్డలు క్వింటా రూ.2,500చొప్పున కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. జిల్లాలో దేవనకొండ, సి.బెళగల్, ఆస్పరి, గోనెగండ్ల, కోసిగి, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, వెల్దుర్తి మండలాల్లో ఉల్లి సాగు అధికంగా చేస్తున్నారని తెలిపారు. అత్యంత కరువు పీడిత ప్రాంతమైన ఈ జిల్లాలో బోరుబావుల కింద 15 శాతం ఉల్లి పంట సాగు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది అధిక వర్షాలకు భారీగా తగ్గిందని తెలిపారు. చేతికొచ్చిన అరకొర పంటను మార్కెట్‌కు తీసుకెళితే క్వింటా రూ.500-600లకు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం క్వింటా రూ.1,200లకు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుందని, పెరిగిన పెట్టుబడి కారణంగా గిట్టుబాటు కావడం లేదని వివరించారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కమిటీ తరపున సీఎంకు లేఖ రాశామని రామకృష్ణ వివరించారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లో ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. మహిళ కడుపులో 5కేజీల భారీ అండాశయ సిస్టును శస్త్రచికిత్స ద్వారా బయటకు తీశారు. 30ఏళ్ల మహిళ కడుపులో నాలుగు నెలల్లో అంతభారీగా పెరగడం అత్యంత అరుదైన సంఘటన అని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి సోమవారం తెలిపారు. ఆగస్టు 20న ప్రసూతి గైనకాలజి విభాగం వైద్యులు అనస్థీషియా విభాగం సహకారంతో విజయవంతంగా శస్త్రచికిత్స చేసి రోగిని సురక్షితంగా కాపాడారని ఆమె అన్నారు. శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డాక్టర్ పి.పద్మజ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.లక్ష్మీ నారాయణమ్మ, డా.సుధారాణి, డా.ఓ.శ్రీనివాస్‌లు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. ఆస్పత్రిలో వైద్య బృందం సమన్వయం, నైపుణ్యం, సేవాస్ఫూర్తికి ఈ సంఘటన నిదర్శనమన్నారు.


చికిత్స అనంతరం రోగితో సూపరింటెండెంట్, వైద్యులు

నిమజ్జన ర్యాలీలో ఘర్షణ

- హెడ్ కానిస్టేబుల్‌పై దాడి


గాయపడిన హెడ్ కానిస్టేబుల్

ఆదోని రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసలబండ గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన యువకులు హెడ్ కానిస్టేబుల్‌పై షేక్ సాబ్‌పై దాడి చేశారు. వివరాల మేరకు.. గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేసేందుకు విగ్రహాలను తరలిస్తున్నారు. ర్యాలీలో రెండు వర్గాల యువకులు పరస్పరం గొడవ పడుతుండటంతో కానిస్టేబుల్ వినోద్‌తో కలిసి సర్దుబాటు చేసేందుకు వెళ్లారు. కాగా గ్రామానికి చెందిన బెస్త సూరి అనే యువకుడు కట్టెతో హెడ్‌కానిస్టేబుల్ షేక్‌సాబ్‌పై దాడికి పాల్పడటంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నల్లప్ప గ్రామానికి చేరుకుని దాడిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

రుద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచినేనిపల్లెకు చెందిన పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త విజయభాస్కర్, అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్‌రఫి సోమవారం తెలిపారు. మాచినేనిపల్లెకు చెంది పద్మావతికి చాగలమర్రికి చెందిన విజయభాస్కర్‌కు 9 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మహానంది, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని పంట పొలాలకు వెళ్లే కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందారు. వివరాలివీ.. బనగానపల్లె మండలంలోని కొత్తపేటకు చెందిన ఎరుకలి సుంకన్న(50) సోమవారం ఉదయం మహానందికి దర్శనానికి వచ్చారు. ఆలయ సమీపంలోని పంట పొలాలకు వెళ్లే కాలువ గట్టుపై కూర్చున్నారు. ఆసమయంలో మూర్ఛవ్యాధికి గురై కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సుంకన్న అప్పుడప్పుడు మూర్ఛవ్యాధికి వస్తుండేదని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తరలించారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు ..

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన కౌలు రైతు చికిత్స పొందుతూ మృతి చెందారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాలివీ.. కోనేటమ్మపల్లెకు చెందిన కాటం సుధాకర్ (60) గ్రామంలో ఆరు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మిరప, ఉల్లి, మొక్కజొన్న, పత్తి తదితర పంటు సాగుచేస్తూ జీవనం సాగించేవారు. 2020 నుంచి పంటలు దెబ్బతినడంతో దిగుబడి సరిగా లేక అప్పులు పెరిగాయి. దాదాపు రూ.15 లక్షలు అప్పు చేశారు. ఆ అప్పు ఎలా తీర్చాలోనని మనస్తాపం చెందేవారు. గతనెల 30న తెల్లవారుజామున ఇంటివద్ద పురుగుల మందు తాగారు. వాంతులు చేసుకుంటుండగా గమనించిన ఆయన భార్య నీలమ్మ, కుమారుడు గమనించి 108 వాహనం పిలిపించి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ప్యాపిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పులికొండ (33) వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండలంకు చెందిన పులికొండ గత నెల స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొదుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లపై విచారణ చేపట్టాలి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్పోర్ట్స్ నకిలీ సర్టిఫికెట్లను మంజూరు చేసిన అథ్లెటిక్ జిల్లా కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ 2025 ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా ఉద్యోగాలు కేటాయించడంతో అథ్లెటిక్ జిల్లా కార్యదర్శి, కొంత మంది పీడీలు కలిసి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. జనార్దన్, వినయ్, అల్తాప్ తదితరులు పాల్గొన్నారు.





అధ్యాపకుల్లో గుబులు

- పెర్ఫార్మెన్స్ పేరుతో తొలగించేందుకు కుట్ర
- ఆర్‌యూలో రెండు రోజులుగా సాగిన రివ్యూ
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన అధ్యాపకులు

తాత్కాలిక అధ్యాపకులు యూనివర్సిటీల్లో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఉన్నా నిబద్ధతతో బోధన కొనసాగిస్తున్నారు. ఇటీవలే ఎస్వీయూ, ఆర్‌యూ ల్లో చేపట్టిన పెర్ఫార్మెన్స్ రివ్యూలతో అధ్యాపకుల్లో గుబులు మొదలైంది. తమను విధుల నుంచి తొలగిస్తారా మదన పడుతున్నారు. కాగా ఈ రివ్యూలకు కొందరు హాజరు కాగా మరికొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో ఆయా ఉద్యోగులపై ఉన్నతాధికారులు కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. అసలు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడే రివ్యూలు నిర్వహించడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆయా యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకుల గుండెల్లో గుబులు మొదలైంది. పెర్ఫార్మెన్స్ పేరుతో తొలగించేందుకు కుట్ర జరుగుతోందని పలువురు ఆందోళన చెందుతున్నారు. రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన రివ్యూకు కొందరు హాజరయ్యారు. మరి కొందరు అధ్యాపకులు కోర్టును ఆశ్రయించి రివ్యూకు హాజరు కాకపోవడం చర్చకు దారితీసింది. ఇటీవల ఎస్వీయూ(శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ)లో ఫెర్ఫామెన్స్ ఇంటర్వ్యూలు నిర్వహించి 43 మంది అధ్యాపకులను తొలగించిన విషయం ఇక్కడి అధ్యాపకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. గతనెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన పెర్ఫార్మెన్స్ తీరుపై అధ్యాపకులు తమను తొలగిస్తారా అంటూ చర్చించుకుంటున్నారు. న్యాయ స్థానాన్ని ఆశ్రయించిన ఉద్యోగులపైన ఉన్నతాధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడు తున్నట్లు తెలిసింది. వారిపై తప్పులు వెతుకుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు.



ఎస్వీయూ, ఆర్‌యూలో మాత్రమే..

రాష్ట్రంలో ఏ యూనివర్సిటీ పెర్ఫార్మెన్స్ రివ్యూ ఇంటర్వ్యూ లను నిర్వహించడం లేదు. ఎస్వీయూ, రాయలసీమ యూనివర్సిటీ (ఆర్‌యూ)లు మాత్రమే ఎందుకు నిర్వహిస్తున్నా యని ఉద్యోగులు మండి పడుతున్నారు. గత ప్రభుత్వంలో అధికారుల వేదింపులతో కొంత మంది కాంట్రాక్టు అధ్యాప కులు విసిగిపోయారని, కూటమి ప్రభుత్వం వస్తే తమకు మంచి జరుగుతుందని టీడీపీ ప్రభుత్వానికి ఓటేస్తే కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసేందుకు..

పెర్ఫార్మెన్స్ రివ్యూ పైన కొంతమంది తాత్కాలిక ఉద్యోగులు త్వరలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. యూనివర్సిటీలో వైసీపీ భావజాలం ఉన్న ఉద్యోగులకే న్యాయం జరుగుతుందని, టీడీపీ భావజాలం ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని మరి కొందరు మండి పడుతున్నారు. . కూటమి ప్రభుత్వమే తమకు న్యాయంచేయాలని పలువురు అధ్యాపకులు వేడుకుంటున్నారు.

పెర్ఫార్మెన్స్ రివ్యూలు నిర్వహించం

ఉర్దూ యూనివర్సిటీలో పెర్ఫార్మెన్స్ రివ్యూలు నిర్వహించం. 14 మంది తాత్కాలిక అధ్యాపకులు ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. పెర్ఫామెన్స్ రివ్యూ చేసి వాళ్ల జీవితాలను ఇబ్బంది పెట్టదలచుకోలేదు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి. ఉత్తమ ఫలితాలు వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో ఉర్దూ యూనివర్సిటీకి మంచి భవిష్యత్తు ఉంది.

డాక్టర్ పీఎస్ షావలి ఖాన్, వీసీ, ఉర్దూ యూనివర్సిటీ, కర్నూలు

ఎవర్నీ తొలగించే ఆలోచనే లేదు

పెర్ఫామెన్స్ రివ్యూ ప్రతి ఏటా నిర్వహిస్తాం. ఏ అధ్యాపకుడిని తొలగించాలనే ఆలోచన మాకు లేదు. ఈరివ్యూతో అధ్యాపకుడు తన బోధన తీరును మరింత మెరుగు పరచుకునేందుకు అవకాశం ఉంటుంది. **- బోయ విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ, కర్నూలు**



పురాతన ఆలయం కూల్చివేత

మహానంది, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం తమ్మడపల్లి గ్రామంలో పురాతన శివాలయాన్ని సోమవారం ఎక్సకవేటర్ సాయంతో కూల్చి వేశారు. శివాలయం అభివృద్ధికి దేవ దాయ శాఖ రూ.1 కోటి సీజీఎఫ్ నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సమక్షంలో శివాలయంలో బాలాలయం పూజలు నిర్వహించారు. శివాలయం పునఃనిర్మాణ పనుల్లో భాగంగానే తొలగించారు.

పారదర్శకమైన ఓటరు జాబితాకు సహకరించండి

ఆత్మకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి ఆయా రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రేమంత్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పారదర్శకమైన ఓటరు జాబితాకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే గతంలో ఓటరు జాబితాలో పేర్లు, అడ్రస్ మార్పు, కొత్త ఓటర్ల కొరకు వచ్చిన దరఖాస్తులను పునర్ పరిశీలన చేయాలని సూచించారు. ఇంకా ఎవరైనా కొత్తగా ఓటరు నమోదు, ఇతర సవరణల కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లను పునఃరుద్ధరించాలి

మహానంది, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తొలగించిన పించన్లను పునఃరుద్ధరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం మహానందిలో సీపీఐ మండల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అబ్బీపురం గ్రామంలోని చెంచుకాలనీ ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కాలనీ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి సామేలు, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గురుమూర్తి శ్రీనివాసులు, దస్తగిరి పాల్గొన్నారు.

'గురురాజా'కు జాతీయ ప్రతిభా పురస్కారం


ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న కొర్రపోలు రామలింగం

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): నంద్యాల శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల కో ఆర్డినేటర్ కొర్రపోలు రామలింగంకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. ఆదివారం గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఉపాధ్యాయ, విద్యాసంస్థల్లో విద్యార్థులకు విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతి భా పురస్కారంతో సత్కరించింది. అందులో భాగంగానే నంద్యాల గురురాజా విద్యాసంస్థల కో ఆర్డినేటర్ రామలింగం విద్యార్థులకు ఇంగ్లీష్ బోధిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతస్థాయిలో నిలపడంతో ఈ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా రామలింగంను గురురాజా విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, ఏవో సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

మిడుతూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని 49 బన్నూరు గ్రామానికి చెందిన లక్కీదాసును అదే గ్రామానికి చెందిన స్వామిదాసు, సామేశ్వరరావు, బాలముని అనే వారు ఆస్తి విషయమై గొడవకు దిగినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఆదివారం రాత్రి లక్కీదాసు పొలం నుంచి ఇంటికి వెళుతుండగా గ్రామ సమీపంలో స్వామిదాసు, సామేశ్వరరావు, బాలముని అతనిపై కర్రతో దాడి చేశారు. లక్కీ దాసుకు తలకు గాయమైందని తెలిపారు. లక్కీదాసు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

10 లోపు నీటివనరుల గణన పూర్తి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిన్నతరహా నీటివనరుల గణన ఈనెల 10లోపు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఎస్‌వో హనుమంతు తెలిపారు. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరిగోపుల, పి.లింగాపురం గ్రామాల్లో నీటివనరుల గణన చేపట్టారు. ఈ గణనలో వీఆర్వో, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వాఖ్యలపై బీజేపీ నిరసన


రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తల్లిపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సోమవారం బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు సూచనతో పార్టీ కార్యకర్తలు నంద్యాల జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రెండవ పట్టణ పోలీసు స్టేషన్లో రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, ఉపేంద్రా రెడ్డి, లక్ష్మీరెడ్డి, రమేష్, ఎస్సీ మోర్చా నాయకులు బాలు, కన్వీనర్ చింతా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జయలక్ష్మి, నాయ కులు రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు బోల్తా.. తప్పిన పెను ప్రమాదం..!



శ్రీశైలం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పరిధిలోని సున్నిపెంట సమీపంలో సోమవారం ఓ కారు బోల్తా పడి పెనుప్రమాదం తప్పింది. పోలీసుల వివరాలు మేరకు.. నందికొట్కూరుకు చెందిన దావీద్, రాజు, మహేష్, జాన్సన్, విల్సన్ కారులో శ్రీశైలానికి వచ్చారు. ఆదివారం రాత్రి శ్రీశైలం డ్యాంను సందర్శించి అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో సున్నిపెంటలోని ఈద్గా సమీపంలో ఉన్న మలుపు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడి రోడ్డు పక్కన పడిపోయింది. అయితే అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న ఆ ఐదుగురు యువకులకు పెనుప్రమాదం తప్పింది. స్వల్పగాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని వైద్యచికిత్సల నిమిత్తం పోలీసులు సున్నిపెంట ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే సీఎం ధ్యేయం

● నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి


ప్రాతకోటలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

పగిడ్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ధ్యేయమని నంద్యాల ఎంపీ, లోక్‌సభ ఫ్లోర్ లీడర్ బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో ఎంపీ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపీ ప్రారంభించారు. గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ఇచ్చిన మాట నిలుపుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నగేష్, తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీవో సుమిత్రమ్మ, సర్పంచ్‌లు శేషమ్మ, సుజాత, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాయకులు కట్టుబడి శ్రీనివాస నాయుడు, అల్లీ ఉసేన్, దశరథరామిరెడ్డి, అజీమ్, సురేష్‌రెడ్డి, జయరాఘవనాయుడు, చిమ్మె బిచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాల పరిశీలన

పడమర ప్రాతకోట ఎంపీపీ(స్పెషల్) పాఠశాలను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సోమవారం పరిశీలించారు. అక్కడి సమస్యలను ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు.స్పందించిన ఎంపీ సమస్యల పరిష్కారం కోసం అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

మిడుతూరు : కడుమూరు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటును సోమవారం ఎంపీ బైరెడ్డి శబరి ప్రారంభించారు. గ్రామంలో ప్రజలు ఫ్లోరైడ్ భారిన పడి అనారోగ్యాలకు గురికాకుండా రూ.5లక్షల ఎంపీ నిధులతో నూతన మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసినట్లు ఎంపీ తెలిపారు. గ్రామ సర్పంచు జీవరత్నం, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పైపులైన్ పనులు : సీపీఎం

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి, పారిశ్రామిక హబ్‌కు వెళ్లేందుకు చేపట్టిన మంచినీటి పైపులైన్ పనులు వాహనదారులకు ప్రమాద కరంగా ఉన్నాయని సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరావు, కొణిదెల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైప్‌లైన్ పనులను కేఎల్ ఎస్ఆర్ కంపెనీ వారు అస్తవ్యస్తంగా చేయడంవల్ల రోడ్డు కుంగిపోయి గుంతలు పడ్డాయ న్నారు. దీంతో పాదచారులు, వాహనదారులు రాక పోకలకు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. కేజీ రోడ్డును నాలుగు అడుగుల వెడల్పు, 9 అడుగల లోతు తవ్వి భారీ పైపులను పూడ్చుకుంటూ వెళుతున్నారన్నారు. భారీ వర్షాలకు పైప్‌లైన్ వెంబడి లోతైన గుంతలు పడుతున్నాయని, దీని వల్ల ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పైప్‌లైన్ ముచ్చుమర్రి, కొణిదెల, నందికొట్కూరు, బొళ్లవరం, బ్రాహ్మణ కొట్కూరుతో కలిపి 5 గ్రామాలకు వెళుతుందన్నారు. ఈ రోడ్డు వెంబడి వెళ్లే ఎద్దుల బండ్లు, స్కూల్ బస్సులు, ఆటోలకు ఇబ్బంది ఎదురవుతోందన్నారు. అధికారులు స్పందించి కంపెనీ వారితో చర్చించి పూర్తిస్థాయిలో మట్టిని నింపి రోడ్డు మర్మతులు చేపట్టాలని వారు కోరారు. లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నాగన్న, శంకరయ్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్


మాట్లాడుతున్న నందికొట్కూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్

నందికొట్కూరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్ తెలిపారు. ఈనెల 13వ తేదీన లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. సోమవారం నందికొట్కూరు కోర్టు ఆవరణంలో స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శరభయ్య, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కళారాధన రజతోత్సవాల్లో భాగంగా కళారాధన, నంద్యాల సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో సోమవారం మాతృభూమికి కళార్చన పోటీలను ప్రారంభించారు. వివేకానంద ఆడిటోరియంలో ప్రారంభమైన ఈ పోటీలను కళారాధన అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, డాక్టర్ రవిక్రిష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిక్రిష్ణ మాట్లాడుతూ ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం లఘు చలన చిత్రవిశ్లేషణ, చిత్రపట విశ్లేషణ, లేఖా రచన, కవితా రచన, పూర్తిగా తెలుగులో మాట్లాడటం తదితర పోటీలు నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంశాపత్రాలు అందజేశారు. ఈ పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రవిప్రకాష్, రంగనాథ్, గౌరవ సలహాదారు చిత్తలూరి రాంప్రసాద్, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, జోన్ చైర్మన్ నిజాముద్దీన్, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి: సీఐటీయూ

వెలుగోడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉచిత బస్సులతో నష్టపోతున్న ఆటో కార్మికులు ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు నాగమోహన్, ఏసురత్నం, మహమ్మద్ రఫి డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్ శ్రీనివాసగౌడుకు వినతి పత్రం అందించారు.. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు సుబ్రమణ్యం వలి, శాలి పహిల్వాన్, రాజే, నాగన్న గోవిందరాజులు పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరోగ్యమాత మహోత్సవం


ఆరోగ్య మాత తేరు ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని ఆర్సీఎం చర్చిలో సోమవారం ఆరోగ్యమాత మహోత్సవం నిర్వహించారు. ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్ఞానేష్ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. చర్చి ఫాదర్ కేడీ జోసఫ్ ఆధ్వర్యంలో గత నెల 23వ తేదీన పతాక ఆవిష్కరణతో ప్రారంభమైన తిరునాళ్ల నవదిన ప్రార్థనలతో ముగించుకుని సోమవారం మహోత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆరోగ్యమాత తేరు ఊరేగింపు నిర్వహించారు.

టీడీపీలో కష్టపడిన వారికే పదవులు

● ఎమ్మెల్యే జయసూర్య ● పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటాం : మాండ్ర, గౌరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు లభిస్తాయని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. 30 సంవత్సరాలు అనుభవం గల ముఖ్యమంత్రి మనకున్నారని, ఇది ఏపీ ప్రజల అదృష్టమన్నారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు సింగిల్‌విండో సొసైటీ చైర్మన్‌గా మద్దూరు హరిసర్వోత్తమ రెడ్డి, డైరెక్టర్లుగా శ్రీనివాసులు, నాగశేషులు నాయుడు ప్రమా ణ స్వీకారం చేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జయసూర్య, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబుకు సాటి ఎవరూ లేరన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా మార్చిన ఘనత ఆయనదేనన్నారు. అనంతరం గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడినవారికే పదవులు దక్కుతాయన్నారు. నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో సాగు, తాగునీరు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, మౌలిక వసతులపై అధికారులు, నాయకులు దృష్టిసారించాలని కోరారు. అనంతరం సింగిల్ విండో సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మద్దూరు హరిస ర్వోత్తమ రెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన పదవికి న్యాయం చేకూరుస్తానన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవస రం లేదని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సీనియర్ టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, కౌన్సిలర్లు జాకీర్, భాస్కరెడ్డి, బీజేపీ నాయకులు దామోదరరెడ్డి, ఖాతా రమేష్‌రెడ్డి, మహేశ్వరెడ్డి, బన్నూరు సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ ఖలీల్‌ఉల్లాబేగ్, లక్ష్మీ నారాయణ యాదవ్, పటాన్ గౌస్‌ఖాన్, మాదవరం ఏసురత్నం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


పింఛన్లు అందజేస్తున్న మాండ్ర, జయసూర్య

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరులో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను వారు పంపిణీ చేశారు. గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం, సింగిల్ విండో చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, మాండ్ర సురేంద్రానథరెడ్డి, గ్రామ నాయకులు ఖలీలుల్లాబేగ్, లక్ష్మీనారాయణయాదవ్, లాడెన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా

● సింగిల్ విండో సొసైటీ చైర్మన్ షాబుద్దీన్


సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన షాబుద్దీన్

ఆత్మకూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని సింగిల్ విండో సొసైటీ చైర్మన్ షాబుద్దీన్ అన్నారు. ఈ మేరకు సోమ వారం ఆయన స్థానిక సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచి సొసైటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి తాను ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. అర్హులైన రైతులందరికీ సొసైటీ ద్వారా రుణాలను మంజూరు చేస్తానన్నారు. సొసైటీకి శాశ్వత భవన నిర్మాణం కోసం చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. తన గురువు, మాజీ డిప్యూటీ డీఈవో సుమతి ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సొసైటీ మేనేజర్ నాగేశ్వరరావు, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, సీనియర్ న్యాయవాది కంచర్ల గోవిందరెడ్డి, నాయకులు యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్, రాజారెడ్డి, అలిహుసేన్, మురళీ, మోహన్, మోతుల్లా హాజరై ఆయన్ను సత్కరించారు.

చెంచుల సమస్యలు పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


చెంచులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

మహానంది, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అడవిపై ఆధారపడి జీవించే చెంచులు వ్యసనాలు వీడి వ్యవసాయం బాట పట్టడం శుభసూచకమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం మహానంది మం డలం అయ్యన్ననగర్ సమీపంలోని చెంచులక్ష్మి గూడెంను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా గూడెంలోని ఇంటింటికీ వెళ్లి చెంచుల సమస్యలను తెలుసుకున్నారు. ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్‌ను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెంచులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలులోకి తెచ్చిందన్నారు. చెంచులకు భూములు కేటాయించి తద్వారా వ్యవసాయ రంగం వైపు వారిని పయనింపజేస్తోందన్నారు. ఈ సందర్భంగా చెంచుగూడెం నాయకులు శ్రీనివాసులు, రాగుల నాగులు తాము అటవీ అధికారులతో ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఇళ్ల పట్టాలు ఇప్పించాలని, తాగునీరు, విద్యుత్ సమస్య తీర్చాలని కోరారు. సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కంచెర్ల శివశంకర్ చౌదరి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, తెలుగు గంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ యాదవ్, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లిఖార్జునరావు, టీడీపీ నాయకులు ఉమాదేవి, పాశం రాజా, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

బుక్కాపురంలో... బుక్కాపురంలో సోమవారం మతి స్థిమితంలేని వృద్ధురాలు సయ్యద్‌బీకి స్థానిక టీడీపీ నాయకుడు గడ్డం హరిప్రసాద్ పింఛన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మారెడ్డి జయరాం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు: రాష్ట్రంలో ఎన్నికల సమయయంలో కూటమి ప్రభు త్వం ఇచ్చిన హామీలను విజయవంతంగా అమలు చేశామని సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ అయ్యాయని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా మొట్ట మొదటిసారి ప్రమాణ స్వీకారం చేసి 30 సం వత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా వెలుగోడులో వేడుకలు నిర్వహించారు.ఆత్మకూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ వంగాల క్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, శంకరరెడ్డి, అబ్దుల్ కలాం, ఎల్లాల క్రిష్ణుడు, వీరభ ద్రుడు, రసూల్, హిదాయత్, జాకీర్, ఖలీల్ పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: కరివేన గ్రామంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమంతకుమార్, తహసీల్దార్ రత్నకుమారి పించన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం 90.81 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. 370 మంది అందుబాటులో లేకపోవడంతో పంపిణీ చేయలేకపోయామన్నారు. వీరికి 2వ తేదీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

మాజీ సైనికుడికి సత్కారం


మాజీ సైనికుడిని సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామానికి చెందిన పడితిరెడ్డి గారి నాగేశ్వరరెడ్డి అనే మాజీ సైనికుడికి సోమవారం గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. నాగేశ్వరరెడ్డి 2005 మార్చి 9న సైనికుడిగా ఆర్మీలో బాధ్యతలు స్వీకరించి 2015లో నాయక్‌గా, 2017లో లాన్స్ హవల్దార్‌గా, 2020లో హవల్దార్‌గా పనిచేశారు. సుమారు 16 ఏళ్ల పాటు ఆర్మీలో పని చేసిన ఆయన ఇటీవలే పదవీ విరమణ చేశారు.

ఘనంగా ఎల్ఐసీ వార్షికోత్సవం

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ 69 వార్షికోత్సవంలో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు బీమా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్ సోమవారం తెలిపారు. బీమా వారోత్సవాల్లో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ క మిషనర్ మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో బీమా సంస్థలున్నా ప్రజల నమ్మకాన్ని చూరగొన్న సంస్థ ఎల్ఐసీ మాత్రమేనని కొనియాడారు. అనంతరం ఏవోలు రఘుకుమార్, రాజశేఖరనాయక్, డీవో జగన్నాథరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అలాగే ఏజెంట్లకు, ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయిస్ నాయకులు రవి కుమార్, నాగన్న, శోభారాణి, సుచిత్ర, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి


సన్మాన గ్రహీతలతో సహచర ఉద్యోగులు

వెలుగోడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి అని ఆత్మకూరు క్లస్టరు ఏపీ పుల్లయ్య అన్నారు. వెలుగోడు మండల మహిళ సమాఖ్యలో సీసీగా విధులు నిర్వహిస్తున్న సుగుణపాల్ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అధికారులు సిబ్బంది ఆయనకు శాలు వాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీసీలు వీఓఏలు, ఎల్‌సీలు హాజరయ్యారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కంటి వైద్య శిబిరం విజయవంతం



శిరివెళ్లలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

శిరివెళ్ల, సెప్టెంబరు 1:(ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకల సందర్భంగా శిరివెళ్లలో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు ఆనంద్ గురూజీ, ఖండె శ్యాంసుందర్‌లాల్ తెలిపారు. ఉదాయనంద హాస్పిటల్ వైద్యురాలు సౌమ్యారెడ్డి ఆధ్వర్యంలో 155 మంది పరీక్షలు చేయించుకోగా 30 మందిని శుక్లం ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉల్లి నాగేశ్వరుడు, సూరా పెద్దన్న, అశోక్, సురేష్, చైతన్య, సురేంద్ర పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేధిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జగ్గయ్య, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంఈవో న్యామతుల్ల, ఏఈలు కొండారెడ్డి, రమణయ్య, ఏపీఎం నాగమ్మ, సూపర్‌వైజర్ సుశీల, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



చాగలమర్రిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని 16వ వార్డులో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు సోమవారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రక్తపూత పరీక్షలు చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య చికిత్సలు చేశారు. మందులను పంపిణీ చేశారు. బీపీ, షుగర్ ఉన్న వారికి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్మశానంలో ముళ్లకంపల తొలగింపు



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

బనగానపల్లె, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లె గ్రామంలోని శ్మశానం ముళ్లకంపలతో నిండిపోయింది. గ్రామ సర్పంచ్ తులసిరెడ్డి సోమవారం ఎక్స్‌కవేటర్‌తో ముళ్లకంపలను తొలగించారు. గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, ఎస్ రామసుబ్బారెడ్డి, హుసేన్‌రెడ్డి, దేవసాయం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పేరెంటాలమ్మ గుడి ప్రాంతంలో ఇంటి స్థలాల పట్టాల లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య సీపీఐ పట్టణ కార్యదర్శి మోటరాముడు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు రామ్మోహన్, పుల్లయ్య, రణత్ యాదవ్, సూర్యప్రతాప్, అబ్బాస్ పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో గుడిసెలు వేసుకుని నివాసాలు ఉంటున్న పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు చిన్న రెహిమాన్, షమీమ్ భేగం, భాస్కర్‌రెడ్డి, నక్కి హరి పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం మున్సిపాలిటీ పరిధిలో నాలుగు ఎస్సీ వార్డులకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, 16వ వార్డు కౌన్సిలర్ సుంకయ్య మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మోటరాముడు, తదితరులు ఉన్నారు.

● డోన్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువజన సమైఖ్య జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా చంద్రశేఖరయ్య

రుద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఇన్‌చార్జి తహసీల్దారుగా డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్యకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ ఉత్తర్వులు సోమవారం జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు మల్లిఖార్జునరావు ఆగస్టు 31న పదవీ విరమణ చేపట్టిన విషయం విధితమే. ఇన్‌చార్జి తహసీల్దారు చంద్రశేకరయ్య మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ చేయాలని కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాపురం సహకార సంఘంలోని ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం సచివాలయంలో యూరియా పంపిణీ విషయంలో రైతులకు, సిబ్బందికి గొడవ చోటుచేసుకోవడంతో సోమవారం ఏడీఏ సుధాకర్, ఏవో ప్రమీల సొసైటీని సందర్శించి అక్కడి పరిస్థితులపై రైతులు, అధికారులతో మాట్లాడారు. 5వతేదీ లోపు యూరియా ప్రతి ఒక్కరికి అందుబాటులోకి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రమీల, సహకార సంఘ సీఈవో సిద్ధి హర్షవర్ధన్, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరమ్మ, సాగునీటి సంఘం అధ్యక్షుడు నాగలింగేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణంలో ఆదివారం గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి సహకరించిన కోవెలకుంట్ల పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి గ్రామ పంచాయతీ వారికి కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని, విజయవంతం చేశారని అన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కొలిమిగుండ్ల దళిత కాలనీలో సోమవారం పైప్‌లైన్లకు మరమ్మతులు నిర్వహించినట్లు సర్పంచ్ జినుగు శివరాముడు తెలిపారు. తాగునీటి వృధాను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు నీటిని వృధా చేయరాదన్నారు.

ఇంకెన్నాళ్లు!

ఏళ్ల కొద్ది పలు భవన నిర్మాణాలు పూర్తి కావడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించి వాటిని మధ్యలోనే వదిలేసింది. చాగలమర్రి మండలంలో నాడు-నేడు కింద పాఠశాల భవన పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. ప్యాపిలిలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న అంగనవాడీ కేంద్ర భవనం అర్థాంతరంగా నిలిచిపోయింది. రుద్రవరం మండలంలో నాగులవరంలో వెల్‌నెస్ కేంద్రం రైతు సేవా కేంద్రం పనులు నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వమైన స్పందించి నిలిచిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

● అసంపూర్తిగా భవన నిర్మాణాలు
● నిధుల గ్రహణంతో సాగని పనులు
● కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



పిచ్చిమొక్కలతో నిండిపోయిన పునాదులు

పునాదులకే పరిమితం

రుద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగులవరం గ్రామంలో వెల్‌నెస్ కేంద్రం రైతు సేవాకేంద్రం పనులు నిలిచిపోయాయి. పునాదుల్లో పిచ్చిమొక్కలు, తీగలు మొలిచి పెరిగాయి. పునాదుల్లో ఏర్పాటు చేసిన ఇనునప కడ్డీలు తుప్పుబట్టాయి. గత వైసీపీ ప్రభుత్వం వల్లే భవనాలు పూర్తి కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చిన్నవంగలిలో పిల్లర్లకే పరిమితమైన భవన పనులు



బాలికోన్నత పాఠశాలలో చెట్టు కిందనే విద్యాబోధన

వైసీపీ పాపం.. విద్యార్థులకు శాపం

చాగలమర్రి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాపం విద్యార్థులకు శాపంగా మారింది. నాడు-నేడు కింద పాఠశాల భవన పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఆయా పాఠశాలలకు నిధుల గ్రహణంతో అర్థాంతరంగా భవన పనులు నిలిచి విద్యార్థులు అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 20 పాఠశాలలకు రెండో విడత నాడు-నేడు కింద దాదాపు రూ.9.49 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కమిటీలు కలిసి పనులు ప్రారంభించారు. అయితే పిల్లర్ల వరకు పనులు చేసి వదిలేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో భవన నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ముత్యాలపాడులో మూడు అదనపు గదులకు రూ.11.61 లక్షలు, గొడిగనూరులో మూడు భవనాలకు రూ.14.74 లక్షలు, మద్దూరులో మూడు భవనాలకు రూ.53 లక్ష లు, బాలుర ఉన్నత పాఠశాలలో 4 భవనాలకు రూ.36.45 లక్షలు, బాలికోన్నత పాఠశాలకు 4 భవనాలకు రూ.49.88 లక్షలు, చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో 4 భవనాలకు రూ.30.20 లక్షలు, కస్తూర్బా పాఠశాలకు రూ.3.49 లక్షలు ఖర్చు చేశారు. నిధులు లేకపోవడంతో పాఠశాలలో పనులు అర్థాంతరంగా నిలిపి వేశారు. గత



బాలికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా భవన పనులు

ప్రభుత్వంలో నిధులు మంజూరుకాకపోవడంతో పనులు చేయకుండా నిలిపి వేశామని హెచ్‌ఎంలు, కమిటీలు చెబుతున్నారు. మంజూరైన నిధుల వరకు పనులు చేశామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు-నేడును తొలగించి మనబడి-మన భవిష్యత్తుగా మార్చింది. ఈ పథకంతోనైన అసంపూర్తిగా ఉన్న భవన పనులు పూర్తి చేసి పాఠశాలల్లో విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు కోరుతున్నారు.

●ఎంఈవో అనూరాధను వివరణ కోరగా గత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాకపోవడం వల్లే పనులు నిలిచి పోయాయని తెలిపారు. మంజూరైన 15 శాతం బిల్లుల వరకు పనులు చేశారు. అసంపూర్తిగా ఉన్న భవన పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

నిధులు కరువు

నిలిచిపోయిన అంగనవాడీ భవనం

ప్యాపిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న అంగనవాడీ కేంద్ర భవనం అర్థాంతరంగా నిలిచిపోయింది. ఈ భవనాన్ని గత వైసీపీ పాలనలో రూ.5లక్షలతో పనులు ప్రారంభించారు. పనులు కూడా దాదాపు టాప్ లెవెల్ వరకు పూర్తయ్యాయి. అయితే చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో నాలుగేళ్లుగా భవనం నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి నిలిచిపోయిన భవనానికి నిధులు మంజూరు చేసి పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అర్థాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

గడువులోపు అర్జీలు పరిష్కరించండి : కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

డోన్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించి, జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ రాజకుమారి గనియా పేర్కొన్నారు. సోమవారం డోన్ డివిజన్ కేంద్రంలోని డోన్ మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేధికకు వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలో వినాయక చవితి నిమజ్జన వేడుకలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేసిన జిల్లా అధికారులకు కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేపీ నరసింహులు, డీఎల్‌డీవో నరసింహారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్, సబ్ రిజిస్ట్రార్ షేక్ మహబూబ్ బాషా, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ, సీడీపీవో శంషాద్‌భేగం, హార్టికల్చర్ అధికారిణి కళ్యాణి, మున్సిపల్ డీఈ రఘు, మున్సిపల్ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వచ్చిన కొన్ని అర్జీలు:

● ప్యాపిలి మండలం పీఆర్ గ్రామానికి చెందిన వడ్డె వెంకట్రాముడు తనకు పీఎం కిసాన్ పథకం వర్తించలేదని, అధికారులు పరిశీలించి పీఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేయాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

● డోన్ మండలం డోన్ గ్రామానికి చెందిన పెద్ద సుబ్బయ్య తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి చేశారు.

● ప్యాపిలి మండలం చెందిన ఎస్.వేదవతి తాను డిగ్రీ వరకు చదువుకున్నాను. తనకు ఉపాధి కల్పించాలని కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

అలాగే పలువురు డోన్ డివిజన్ నుంచి ప్రజల నుంచి వివిద సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రసాద్‌గౌడు పాల్గొన్నారు.

మహిళలకు స్త్రీ శక్తి పథకం వరం : ఎమ్మెల్యే



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన స్త్రీ శక్తి పథకం మహిళలకు వరం లాంటిదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం ఆళ్లగడ్డ ఆర్టీసీ బస్టాండ్ నుంచి మార్కెట్ యార్డు వరకు మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డులో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మహిళలు ఎవరూ ఇబ్బందులు పడకూడదని తల్లికి వందనం, మూడు గ్యాస్ సిలిండర్‌లు, స్త్రీ శక్తి పథకం లాంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఆళ్లగడ్డలో త్వరలో పరిశ్రమలు తెప్పించి, ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం గా ప్రమాణం చేసి 30 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆళ్లగడ్డ ప్రజల కోసం ఒక టోల్ ఫ్రీ నెంబర్ లాంచ్ చేస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్య అయిన 9993339350 నంబర్‌కు 4 వ తేదీ నుంచి సమస్యలు చెప్పవచ్చాన్నారు. సమావేశంలో పొదుపు మహిళలు, మెప్మా అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోండి

సంజామల,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలని ఎస్‌ఐ రమణయ్య కోరారు. సోమవారం రాత్రి ఆకుమళ్లలో జరిగిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్టాండు సమీపంలో ఏర్పాటైన సమావేశంలో ఆయన ప్రజలతో మాట్లాడారు. ప్రధానంగా సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లో ఆధార్ నెం. బ్యాంకు ఖాతా నెంబర్లు అడిగినా ఇవ్వరాదన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల ఉన్నత విద్యను అందించి ప్రయోజకులు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన గణేశ్ ఉత్సవాలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలో వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా సహాయ సహకారాలు అందించిన అధికారులకు గణేష్ ఉత్సవ కేంద్ర సమితి గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, అధ్యక్షుడు ఆవుల భాస్కర్‌రెడ్డి, న్యాయసలహాదారుడు నీలకంఠేశ్వరం ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆవుల సేవా సమితి కేంద్ర కార్యాలయంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బఠ్రెంకల పుల్లయ్య,సహాయ కార్యదర్శి రామాచారి, దస్తగిరిరెడ్డి, సత్యప్రసాద్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో కేజీబీవీ విద్యార్థి ప్రతిభ

సంజామల,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంజామల కేజీబీవీ విద్యార్థి ఆగస్టు 30,31న డోన్ పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, రజత, కాంస్య పథకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం విద్యాలయంలో ప్రిన్సిపాల్ శ్రీలేఖ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నాగతప్సి, గురు హర్షిత, యస్విత, కీర్తనలను అభినందించారు.

ప్రజల వద్దకు పాలన సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

● సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోరి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఎంఎస్ఆర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి నేటికి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టెక్నాలజీ అభివృద్ధిలో చంద్రబాబుదే కీలకపాత్ర



మాట్లాడుతున్న నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో టెక్నాలజీ అభివృద్ధిలో కీలకపాత్ర సీఎం చంద్రబాబునాయుడు దేనని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ కో.కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. సోమవారం చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30ఏళ్లు అయిన సందర్భంగా కనకాద్రిపల్లెలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కనకాద్రిపల్లె సర్పంచ్ శివశంకర్, వెంకటమల్లారెడ్డి, పెద్దిరెడ్డి, రామలక్ష్మణ్ణ, పెద్దవెంకటేషు పాల్గొన్నారు.

మాంసాభివృద్ధి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా అజిముద్దీన్



చాగలమర్రి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామానికి చెందిన ముల్లా అజిముద్దీన్ మాంసాభివృద్ధి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. కూటమి ప్రభుత్వం సోమవారం డైరెక్టర్ పదవులను ప్రకటించింది. రాష్ట్ర డైరెక్టర్ పదవికి కృషి చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆళ్లగడ్డ టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్, భూమా జగత్‌విఖ్యాతరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తనకు అప్పగించిన కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని బాధ్యతగా విధులు నిర్వహిస్తామని అన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మండల స్థాయి అధికారులు తక్షణమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశించారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా వేధికలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు.

పింఛన్లతో పేదలకు భరోసా

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలందరికీ భరోసా ఉంటుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 26వ వార్డు తారక రామ్‌నగర్, మండలంలోని దేవరబండ గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో వృద్ధులు, వికలాంగులు ఆర్థికంగా భరోసా ఉంటుందని పేర్కొన్నారు. వలసల గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, లక్కసాగరం లక్ష్మీరెడ్డి, అబ్బర్వర్ హరి, అర్జున్ రెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, దేవరబండ వెంకటనారాయణగౌడు, రాముగౌడు, వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు యాదవ్, ఎల్లగౌడు, వెంకటస్వామి, టీఈ రాఘవేంద్రగౌడు, తాడూరు వెంకటరమణయ్య, గుండాల జయరాముడు, దిలీప్‌రెడ్డి, ప్రతాప్, వలసల బాలుడు పాల్గొన్నారు.

● వెంకటనాయునిపల్లె గ్రామ సచివాలయంలో పింఛన్లను గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, అధికారులు అందజేశారు.

బేతంచెర్ల: ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 1వ వార్డు బైటి పేటలో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, కమిషనర్ హరిప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి సహకార సంఘం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్, పోలూరు రాఘవరెడ్డి, తిరుమలేష్ చౌదరి, భీమేశ్వర్ రెడ్డి, సుధాకర్, పాల్గొన్నారు.

శిరివెళ్ల: శిరివెళ్లలోని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన సోమవారం పంపిణీ చేశారు కార్యక్రమంలో డ్వామా పీడీ సూర్యనారాయణ,ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలో యల్లావత్తుల, కోటకొండ, చిన్నకంబలూరు గ్రామాల్లో సోమవారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి పింఛన్లను పంపిణీ చేశారు.

కోవెలకుంట్ల : మండలంలో భీమునిపాడులో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఎంప్లాయిమెంటు శాఖ అధికారి, కోవెలకుంట్ల మండల ప్రత్యేక అధికారి కళ్యాణి పరిశీలించారు. సోమవారం తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, ఏవో భరణితో కలిసి పింఛన్లు అందించారు.

● కోవెలకుంట్లలోని సంతపేటలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కేరళ వైద్యశాల సమీపంలో దివ్యాంగ పింఛన్ రాలేదంటూ ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన దివ్యాంగుడు గులాంబాషాకు పింఛన్ తిరిగి పునరుద్ధరణ చేశారు. సోమవారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా దివ్యాంగుడి ఇంటివద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కొలిమి ఉసేన్ వలి, పట్టణ అధ్యక్షుడు మౌలాలి, కార్యదర్శి అనిఫ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో సోమవారం పింఛన్‌ల పంపిణీ 90శాతం పూర్తయింది. పాతపాడులో టీడీపీ నాయకుడు, సర్పంచ్ మహేశ్వరరెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే పట్టణంలో టీడీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు రాయలసీమ సలాం ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేశారు.